క్లుప్తంగా

నూతన డీపీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరిచందనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ: నల్లగొండ డీపీఆర్‌ఓగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీపీఆర్‌ఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేయగా, మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నల్లగొండకు బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు కలెక్టర్ హరిచందనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన శాలిగౌరారం ఎస్‌ఐ



ఐలయ్య, ఎస్‌ఐ

శాలిగౌరారం: శాలిగౌరారం ఎస్‌ఐగా ఎం. ఐలయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ఉప్పల సతీష్ నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా డీసీఆర్బీలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఐలయ్య బదిలీపై శాలిగౌరారం వచ్చారు.

ఆర్థికసాయం అందజేత



నివాళులర్పిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం: మండల కేంద్రానికి చెందిన రైతు జోగు మల్లయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని శనివారం టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. మల్లయ్య చిత్రపటానికి నివాళర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర రణీలయాదగిరి, పార్టీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

శివలీలకు గ్లోబల్ అచీవర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శివలీల

కనగల్: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యురాలు కంబాల శివలీల ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ వారి గ్లోబల్ అచీవర్–2024 అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అవార్డు అందుకున్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ: మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వారికి ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను http://telanga nams.cgg.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజు ఓసీలు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 చెల్లించాలన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

నకిరేకల్: ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో నకిరేకల్‌లోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించిచారని శనివారం ఆ పాఠశాల హెచ్‌ఎం బి. అశోక్‌కుమార్, పోటీ పరీక్షల ఇన్‌చార్జి కె. లింగయ్య తెలిపారు. ఎం. నిషిత(4వ తరగతి), ఏ. అనిరుధ్(5వ), చంద్రశ్రీనందన్(6వ), రాజ్‌కుమార్(7వ), కృత్విక (8వ) జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించారని తెలిపారు. వికాస్(5వ తరగతి), భరత్(6వ), సరస్వతి(7వ), హిమశ్రీ (8వ), హర్షిత్‌రెడ్డి(9వ), అఫ్షన్ మహజ్(10వ) జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకులు సాధిచారని పేర్కొన్నారు. అదే విధంగా సామ్యుల్ రాజ్(6వ తరగతి), విఘ్నేష్ (7వ), మిన్హాజ్(7వ), లోహిత(8వ), రేహాన్(9వ) జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారని అన్నారు.

మహిళలపై దాడులు పెరిగాయి

- ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత గర్ల్స్ కన్వీనర్ దీప్సితాదార్



మాట్లాడుతున్న దీప్సితాదార్

నల్లగొండ టౌన్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలు, విద్యార్థినులపై అత్యాచారాలు, మానభంగాలు, దాడులు పెరిగిపోయాయని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత గర్ల్స్ కన్వీనర్ దీప్సితాదార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక గడియారం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. 'బేటీ బచావో–బేటీ పడావో, దేశంలో నరేంద్రమోదీ హటావో' నినాదంతో విద్యార్థిలోకం ముందుకు సాగాలన్నారు. మానభంగాలు చేసిన వారు జైలు నుంచి విడుదలయ్యేటప్పుడు బీజేపీ బ్రహ్మరథం పడుతోందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వంలో మహిళలపై వివక్ష పెరిగి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను హిందూ, ముస్లిం, క్రిస్టియన్లుగా విభజించి మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యమాల ఖిల్లాగా పేరొందిన నల్లగొండ గడ్డపై పుట్టిన సాయుధపోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎల్.మూర్తి, తాళ్ల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థినుల సమస్యలపై నిరంతరం పోరాతున్న సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని గుర్తు చేశారు. విద్యారంగం బలోపేతానికి అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ గర్ల్స్ కన్వీనర్ పూజ మమత, జిల్లా కన్వీనర్ కావ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, విద్యార్థి, యువజన నాయకులు రేణుక, స్పందన, ప్రసన్న, కోట అశోక్‌రెడ్డి, డి.శ్రీకాంత్‌వర్మ, శంకర్, బుడిగ వెంకటేశ్, రమావత్ లక్ష్మణ్, సైదానాయక్, కోరె రమేష్, సంపత్, వీరన్న, రవి, జగదీష్, శివ, అంజలి, బిందు, మాధవి, దేవి, మౌనిక, ఐశ్వర్య, ఉమ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాజు మృతదేహం

శాలిగౌరారం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పెర్క కొండారం గ్రామానికి చెందిన ధర్నెబోయిన రాజు(46) అధికంగా మద్యం సేవించేవాడు. గత రెండు రోజులుగా గ్రామంలో తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. రాజుకు మానసిక రుగ్మత ఉండటంతో అతడు భార్య రమణను తిట్టడం, కొట్టడం లాంటివి చేస్తుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం సేవించి భార్య రమణను కొట్టడంతో ఆమె హైదరాబాదులోని తన బంధువుల వద్దకు వెళ్లింది. నిత్యం మద్యం సేవిస్తున్న రాజుకు మానసిక రుగ్మత విషమంపై వైద్యులు సూచించిన నిద్ర మాత్రలు వేయాలని రాజుతో కలిసి మద్యం సేవించిన స్నేహితులకు చెప్పింది. దీంతో వారు మోతాదుకు మించి మద్యంలో నిద్రమాత్రలు వేయటంతో ఆ మద్యం తాగిన రాజు స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో రాజు స్నేహితులు విషయాన్ని అతడి భార్యకు చెప్పడంతో ఆస్పత్రికి తరలించాలని కోరింది. దీంతోనల్లగొండలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కొడుకుతో కలిసి మద్యం సేవించిన స్నేహితులే హత్య చేసి ఉంటారని మృతుడి తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అయిలయ్య తెలిపారు.

మేకలను అపహరించిన దొంగల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

మర్రిగూడ: మేకలను దొంగలించిన ముగ్గురు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు నాంపల్లి సీఐ ఎ. నవీన్‌కుమార్ తెలిపారు. సీఐ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన, అదేవిధంగా 7వ తేదీన మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో ఇరగదిండ్ల సత్తయ్యకు చెందిన మూడు మేకలు, పల్లె ఆంజనేయులుకు చెందిన రెండు మేకలు చోరీకి గురయ్యాయి. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఎరుపు రంగు కారు అనుమానాస్పదంగా కనిపించింది. ఈ నెల 10వ తేదీ ఉదయం మర్రిగూడ మండల పరిధిలోని సరంపేట ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే సమయంలో ఎరుపు రంగు కారులో వచ్చిన వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారి పట్టుకున్నారు. కారులో ఉన్నది హాలియా మండలంలోని అలీనగర్ చెక్‌పోస్టుకు చెందిన సంపంగి వెంకటేష్, నిడమనూరుకు చెందిన దాసర్ల వినోద్, నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన కనుకల బాలరాజుగా గుర్తించి వారిని విచారించగా.. మేకలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులు మర్రిగూడలోనే కాకుండా రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో, నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో, దేవరకొండ మండల పరిధిలో, మునుగోడు మండలంలో, దేవరకొండ మండలంలోనూ చోరీలు చేసినట్లు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 8 మేకలు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు గతంలో కూడా ఇలాంటి దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు వివరించారు. కాగా మరో నిందితుడు కనగల్ గ్రామానికి చెందిన కుతాటి క్రాంతి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ కె. రంగారెడ్డిని జిల్లా ఎస్పీ చందనాదీప్తి, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు. విలేకరుల సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, రవికుమార్, సత్యనారాయణ, సైదులు, హుస్సేన్, వాహీద్, యాదగిరి ఉన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



వెంకన్న (ఫైల్)

చిట్యాల: మండలంలోని వట్టిమర్తికి చెందిన లారీ డ్రైవర్ ఒరిస్సా రాష్ట్రంలో గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిమర్తి గ్రామానికి చెందిన బెల్లపు వెంకన్న(54) చిట్యాల పట్టణ పరిధిలోని ఓ పరిశ్రమకు చెందిన లారీపై డ్రైవర్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా నాలుగు రోజుల క్రితం వెంకన్న లారీపై ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లాడు. శుక్రవారం అక్కడ లారీలోని సామాగ్రిని అన్‌లోడ్ చేసిన చిట్యాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో వెంకన్నకు గుండెపోటు రావటంతో లారీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి స్టీరింగ్ పైనే మృతిచెందాడు. వెంకన్న మృతదేహం శనివారం రాత్రికి స్వగ్రామానికి రానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

బలవంతపు డిపాజిట్లు మానుకోవాలి

నల్లగొండ టౌన్: పొదుపు సంఘాల నుంచి బ్యాంకు అధికారులు బలవంతంగా డిపాజిట్లు చేయించుకోవడం మానుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా సంగాలకు ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు ఇవ్వకపోగా అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బలవంతంగా డిపాజిట్ చేయించుకున్న డబ్బులను ఆయా సంఘాలకు తిరిగి ఇవ్వాలన్నారు. ప్రతి మహిళకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పొదుపు సంఘాల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. గ్రామాల్లో సమభావన సంఘాలకు భవనాలు నిర్మించాలని, బెల్ట్ షాపులను బంద్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిల్లా సరోజ, జిల్లా కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ, భూతం అరుణకుమారి, పాదూరి గోవర్ధని, చనగాని సైదమ్మ, గోలి వెంకటమ్మ, ఎండీ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టూటౌన్: పెన్షనర్ల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి. మోహన్‌రావు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో నిర్వహించిన సంఘం నల్ల గొండ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాద వాసుదేవ్, జిల్లా పుల్లయ్య, సుధాకర్, శేషారెడ్డి, కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణ

నార్కట్‌పల్లి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం మహేశ్వర్‌రావు తెలిపారు. శనివారం నార్కట్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అరటి నారుతో బుట్టలు అల్లే విధానంపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు త్వరలో నిర్వహించనున్న శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బెల్ట్ షాపులు మూసివేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, కాంగ్రెస్ నేతలు

మునుగోడు: మండలంలోని కొంపల్లి, కల్వకుంట్ల, ఎల్లగూడెం, కచలాపురం తదితర గ్రామాల్లో బెల్ట్ షాపులను మూసివేయాలని శనివారం మహిళలతో కలిసి డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బెల్ట్ షాపుల నిర్మూలనకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, జాల వెంకన్నయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సూర్యాపేట అదనపు కలెక్టర్ ప్రియాంక

రామగిరి(నల్లగొండ): విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాలయాలపై ఉందని సూర్యాపేట అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు ప్రైమరీలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో చిట్యాల ఎంపీడీఓ బి. లాజర్, ప్రిన్సిపాల్ బ్రదర్ బాలఇన్నా, కరస్పాండెంట్ హృదయ్‌కుమార్‌రెడ్డి, బ్రదర్ చాకో, బ్రదర్ పి.టి. జోసెఫ్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృత శిశువు

నల్లగొండక్రైం: నల్లగొండ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం మృతశిశువు లభ్యమైంది. స్థానిక ఫ్లై ఓవర్ సమీపంలో పట్టాల మధ్యన వదిలిన శిశువును రైల్వే పోలీసులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి కవలల్లో ఒక శిశువు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు డాక్టర్లు రైల్వే పోలీసులకు వివరించారు. నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామానికి చెందిన శేఖర్–నవిత దంపతులకు మొదటి సంతానంలో కుమారుడు జన్మించగా, డిసెంబరు 30, 2023న రెండో సంతానంలో ఇద్దరు కవల ఆడ పిల్లలు జన్మించారు. రెండో కవల పిల్ల అనారోగ్యం బారినప పడడంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ శిశువు ఫిబ్రవరి 9న రాత్రి మృతి చెందింది. రాత్రి కవల పిల్ల మృతదేహాన్ని తండ్రి శేఖర్‌కు అప్పగించామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఏం చేయాలో తెలియక శిశువు మృతదేహాన్ని రైలు పట్టాలపై వదిలి వెళ్లినట్లు శేఖర్ రైల్వే పోలీసులకు తెలిపారు. శిశువు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తండ్రి శేఖర్‌కు అప్పగించినట్లు రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ, హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు.

మూడోసారి బీజేపీ విజయం ఖాయం

కేతేపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో గ్రామాల అభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి కృషిచేసిన మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కోఆర్డినేటర్ పిట్టల వెంకట్, మల్లెబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

- పూజల్లో పాల్గొననున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. 18 అడుగుల ఏకశిల విగ్రహానికి నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. శనివారం వేద పండితుడు జక్కయ్యపల్లి జగన్నాథశాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహానికి 36 రకాల జలాలు, ధాన్యాలతో అభిషేకం, మహాస్నాపనము చేశారు. ఆధ్యాత్మికవేత్త కాకునూరి సూర్యనారాయణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, దేవులపల్లి నాగరాజుశర్మ, బండారు ప్రసాద్, వేనేపల్లి లక్ష్మణరావు, బైరగోని రాజయ్య, కంది సూర్యనారాయణ, తదిరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొననున్న కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి..

అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శాంతి హోమం, యంత్ర ప్రతిష్ఠ, కళావాహనం, ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, బలిహోరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద పండితులు, బ్రాహ్మణులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

రూ.25లక్షల విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఓరుగంటి వంశీ

ఈ పూజా కార్యక్రమంలో ఓరుగంటి వంశీ పాల్గొని తన తండ్రి ఓరుగంటి రాములు జ్ఞాపకార్థం ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. తన తండ్రి ఓరుగంటి రాములు 48 సంవత్సరాల క్రితమే ఆలయ నిర్మాణం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తుచేశారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు బండారు ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, రాజయ్య, లక్ష్మణరావు, గోర్లపాటి వెంకటయ్య, గుండగోని వెంకన్న యాదవ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్: మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు

నల్లగొండ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించి తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చి ఇప్పడు దానికి అమలు చేయకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎండీ మోహినొద్దీన్, డి.సుదర్శన్‌రెడ్డి, గోపా ల్, బోగరి రాంకోటి, బండమీది వెంకన్నయాదవ్, యాదయ్య, నాతాళ్లరాజు, నర్ర శేఖర్‌రెడ్డి, పందిరి జనార్దన్‌రెడ్డి, బుర్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి బొల్లగొరి కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలి..

నకిరేకల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించడం కోసం కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన రైతు సంఘం నకిరేకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16వ తేదీన నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చలకాని మల్లయ్య, కోట లింగయ్య, శ్రీను, లక్ష్మి, స్వరూప, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కట్టంగూర్: ఆత్మీయ సమ్మేళనంలో పోప్‌పాల్ 6వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



కనగల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

కట్టంగూర్: మండలంలోని చిన్నపురి గ్రామంలో గల పోప్‌పాల్ 6వ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సరదాగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. పాపయ్య, దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, లూయిస్ మేరీ, కొమరయ్య, సత్తయ్య, పూర్వ విద్యార్థులు జానీపాష, ప్రవీణ్, కృష్ణ, శంకర్, ప్రశాంత్, నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, సోమేష్, లక్ష్మణ్ ఉన్నారు.

కనగల్‌లో..

కనగల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు శనివారం దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ దేవస్థానం పరిధిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



నల్లగొండ: స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న న్యూస్ స్కూల్ విద్యార్థులు



నాయకుల వేషధారణలో ర్యాలీ తీస్తున్న న్యూస్ స్కూల్ విద్యార్థులు



కనగల్: రేగట్టె జెడ్పీహెచ్‌ఎస్‌లో..



కట్టంగూర్: బొల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



గట్టుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



నార్కట్‌పల్లి : ఎస్పీఆర్ స్కూల్‌లో..



చిట్యాల: ఉరుమడ్ల ప్రగతిసాయి విద్యానికేతన్‌లో..



చండూరు: బోడంగిపర్తి ఎంజేపీ పాఠశాలలో..